
సాక్షి
పల్నాడు

సోమవారం ♦ 7 ♦ జులై ♦ 2025



కనకదుర్గమ్మ తల్లికి బోనాలు

పిడుగురాళ్ల: పట్టణంలోని వాసవీనగర్‌లో ఉన్న కనకదుర్గమ్మ తల్లికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 526.40 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 3,202 క్యూసెక్కులు విడుదలవుతోంది.

గాజుల అలంకరణలో మహంకాళీ అమ్మవారు



దుగ్గిరాల: కంఠంరాజుకొండూరు గ్రామంలోని మహంకాళీ ఆలయంలో ఆదివారం అమ్మ వారికి గాజుల అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

న్యూస్‌రీల్

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం



ప్రత్తిపాడు: రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపిన ప్రకారం... వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడుకు చెందిన ఓ రైస్ మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం పెద్ద ఎత్తున నిల్వ చేశారన్న సమాచారం జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు అందింది. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు గుంటూరు సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ జి. భానూదయ, సీఐ రమానాయక్, సిబ్బందితో కలిసి మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారాన్ని రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారులకు తెలియజేశారు. వట్టిచెరుకూరు తహసీల్దార్ క్షమారాణి, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌లు మిల్లు వద్దకు చేరుకున్నారు. బస్తాల్లో నిల్వ చేసిన సుమారు 60 టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పటాలంలో తొలి ఏకాదశి పూజలు



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి సంస్థ పరిధిలోని ఆరవ బెటాలియన్‌లో ఆదివారం ఆషాఢ తొలి ఏకాదశి సందర్భంగా మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. బెటాలియన్ కమాండెంట్ మాట్లాడుతూ భక్తులు అమ్మవారికి సారె చీరెలు సమర్పించడం ఆనవాయితీ అని, అమ్మవారి దయతో కుటుంబాలు సంతోషంగా ఉంటాయని నమ్మకం అని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆశీర్వాదం, అధికారులు, స్థానిక మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరించండి

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. ఓవర్ బ్రిడ్జి పనుల నేపథ్యంలో చేపట్టిన ట్రాఫిక్ మళ్లింపును ఎస్పీ ఆదివారం స్వయంగా పరిశీలించారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం శివాలయం వీధికి చెందిన మహిళలు ఆదివారం విజయవాడ కనక దుర్గమ్మ వారికి ఆషాఢ సారె సమర్పించారు. శ్రీ సోమేశ్వరస్వామి వారి దేవాలయంలోని పార్వతీ దేవికి తొలుత సారె సమర్పించి, మేళతాళాలతో కాలినడకన విజయవాడ దుర్గమ్మ వారికి సారె తీసుకెళ్లారు. స్థానిక మహిళలు అమ్మాజి, అనూష, సరళ, స్రవంతి, కౌసల్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వినుకొండ కొండపైన అఖండజ్యోతి వెలిగించిన హిమాలయ బాబా భక్తులు



కోటప్పకొండ ఆలయం వద్ద భక్తుల సందడి



కోటప్పకొండ: క్యూలైన్లలో భక్తుల రద్దీ

కొండంత సంబరం

- వినుకొండలో ఘనంగా కొండ పండుగ
- రామలింగేశ్వరుడికి విశేష పూజలు
- కొండపైకి పోటెత్తిన భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

వినుకొండ: తొలిఏకాదశి పర్వదినం, వినుకొండ తిరునాళ్ల సందర్భంగా వినుకొండ కొండపైకి భక్తులు పోటెత్తారు. ఉదయం 6 గంటలనుంచే భక్తులు కొండపైకి చేరుకుని బాలాలయాలల్లో ఉన్న రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో కొండపైకి 40 బస్సులు ఏర్పాటు చేశారు. కొండపైన భక్తులకు తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. స్వచ్ఛంద సేవాసంస్థలు, ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లి కార్జునరావులతో పాటు పలువురు పార్టీ నాయకులు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

అఖండజ్యోతి ప్రజ్వలన

వినుకొండ కొండపైన అఖండజ్యోతి ప్రజ్వలన సాయంత్రం 6:30 నిముషాలకు జరిగింది. హిమాలయ బాబా భక్తులు జ్యోతిని వెలించారు. కొండపైన అఖండజ్యోతి చూసిన భక్తులు ఓం నమఃశివాయ అంటూ నినదించారు.

- తిరునాళ్ల సందర్భంగా ఎస్‌వీపీ గ్రౌండ్‌లో ఎలక్ట్రికల్ ప్రభలు ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాల ఆవరణలో సాంఘిక, పౌరాణిక నాటికలు, కోలాటాలు, చెక్క భజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.



వినుకొండ కొండపైన బాలాలయం వద్ద భక్తుల కోలాహలం

- తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 400 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 300 మందికిపైగా మున్సిపల్, రెవెన్యూ, దేవదాయ సిబ్బంది సేవలందించారు. కొండకింద పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

కోటప్పకొండపై 'తొలి' పూజల సందడి

నరసరావుపేట రూరల్: తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి త్రికోటేశ్వరుణ్ణి దర్శించుకొని తరించారు. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు బిందెతీర్థంతో స్వామి వారికి తొలి అభిషేకాలను నిర్వహించారు. పంచామృతాలు, ఫలాలు, విశేష ద్రవ్యాలతో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా జరిపారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక అలంకరణ చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు.

- ఉదయం కొండపై భక్తుల రద్దీ నెలకొంది. ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనంతో పాటు అభిషేక దర్శనాన్ని భక్తుల కల్పించారు. సోపానమార్గంలో మెట్ల పూజ చేసుకుంటూ కొండ మీదకి చేరుకొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు ఆలయం వెనుక రావి చెట్టు, మహనందీశ్వరుడి వద్ద దీపాలు వెలిగించారు. ధ్యానశివుడు, నాగేంద్రుడి పుట్ట వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వర స్వామి

- కొండ మీద పార్కింగ్ స్థలం వాహనాలతో నిండిపోయింది. దీంతో పోలీసులు కొండదిగువనే వాహనాలను నిలిపివేశారు. దీంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఘాట్‌రోడ్డులోని పార్క్ వద్ద యాత్రికుల సందడి నెలకొంది. కొండమీద పలు స్వచ్ఛంద సంస్థలు, దిగువున సత్రాలు వద్ద ఉచిత ప్రసాద పంపిణీ నిర్వహించారు. ఆలయ ఈఓ డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్వామి వారిని దర్శించుకున్నారు.

భక్తజన సంద్రం.. వైకుంఠపురం



విశేషాలంకారంలో వేంకటేశ్వరుడు

అమరావతి: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని పుణ్యక్షేత్రాలైన అమరావతి, వైకుంఠపురం దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం వేకువ జామునుంచే భక్తులు పెద్ద సంఖ్యలో వైకుంఠపురం వేంకటేశ్వరుని దర్శించుకునేందుకు తరలివచ్చారు. భక్తులు వైకుంఠపురం క్షేత్రంలో కృష్ణానది ఉత్తర వాహినిలో పుణ్యస్నానాలు ఆచరించి కొండపైన స్వయంభూగా వెలసిన వేంకటేశ్వరుని దర్శించారు. అనంతరం కొండకింద వేంచేసియున్న వేంకటేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయాన్నే స్వామివారికి పంచామృత స్నపనానంతరం విశేష అలంకారం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. దేవదాయశాఖాదికారులు కొండపైన, కొండకింద మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. అలాగే పెదమద్దూరు చెందిన భక్తబృందం నిర్వహించిన భజనలు, వైకుంఠపురం భక్తులు ప్రదర్శించిన కోలాటం భక్తులను అలరించాయి.



ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు

త్రికోటేశ్వరా.. నిను చేరేదెలా?



ఘాట్‌రోడ్డు వద్ద వాహనాలను నిలిపివేయడంతో కాలినడకన కొండపైకి వెళ్తున్న భక్తులు

- కోటప్పకొండకు వచ్చే భక్తులపై పోలీసు ఆంక్షలు
- ఘాట్‌రోడ్డు వద్ద వాహనాలు నిలిపివేత
- భక్తుల తీవ్ర ఇబ్బందులు
- వీఐపీల సాకుతో లిఫ్ట్ నిలిపివేత
- వృద్ధుల పైనా కనికరం చూపని అధికారులు
- నిత్యాన్నదానం నిలిపివేతతో ఆకలితో వెనుదిరిగిన భక్తులు



కోటప్పకొండలో నిలిపివేసిన అన్నప్రసాద వితరణ

నరసరావుపేట రూరల్: తొలిఏకాదశి పర్వదినాన కోటప్పకొండకు వచ్చిన భక్తులకు కొండ ఎక్కకుండానే దేవుడు కనిపించాడు. త్రికోటేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఆదివారం అడుగడుగునా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొండ దిగువున పోలీసుల అతి జాగ్రత్త, కొండ మీద సిబ్బంది మధ్య సమన్వయ లోపం కారణంగా భక్తులు అవస్థలు పడాల్సి వచ్చింది.

ఓవర్ యాక్షన్‌తో తిప్పలు

తొలిఏకాదశి రోజున జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు స్వామి వారి దర్శనానికి వస్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు కార్లు, సమీప ప్రాంతాల నుంచి వారు ద్విచక్రవాహనాలతో పాటు గ్రామాల నుంచి వచ్చే భక్తులు ట్రాక్టర్ల మీద కొండకు చేరుకుంటారు. కొండ మీద పార్కింగ్ సమస్య పేరుతో ఈ ఏడాది కొండ దిగువునే కార్లు, ట్రాక్టర్లను నిలిపివేశారు. ద్విచక్ర వాహనాలను కూడా అప్పుడప్పుడు వదిలారు. ఘాట్‌రోడ్డు వైపు వెళ్లే వాహనాలను ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు పెట్టి అడ్డుకున్నారు. కొండకావూరు రోడ్డు ద్వారా పార్కింగ్ స్థలానికి మళ్లించారు. మహాశివరాత్రి పర్వదినాన మాత్రమే ఈ విధంగా ప్రైవేటు వాహనాలను కొండమీదకు అనుమతించరు. ఈ సారి పోలీసులు తొలిఏకాదశి రోజున కూడా వాహనాలను అనుమతించకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రైవేటు వాహనాలను అనుమతించకపోవడంపై పోలీసులు ముందస్తుగా భక్తులకు ఎలాంటి సమాచారం అందించలేదు. దీంతో వాహనాలపై వచ్చిన భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

అన్నదానం నిలిపివేత

భక్తులకు అన్నప్రసాదం అందించాల్సిన అన్నప్రసాదశాలను ఆదివారం మూసివేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మధ్యాహ్న సమయంలో అన్నప్రసాద శాలకు వెళ్లగా ఈ రోజు అన్నప్రసాద వితరణ నిలిపివేసినట్లు అక్కడి సిబ్బంది తెలిపారు. ఎందుకు నిలిపివేశారని భక్తులు ప్రశ్నించగా కేవలం సిబ్బందికి మాత్రమే ఈ రోజు అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు. దీంతో భక్తులు నిరాశతో వెనుదిరిగారు. ఆలయంలో నిత్యాన్నదానం జరుగుతున్నా పర్వదినాల్లో ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానం నిలిపివేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వృద్ధుల అవస్థలు

స్వామి వారి దర్శనంకోసం వచ్చే వృద్ధులు ఆలయ ప్రాంగణం వద్దకు చేరుకునేందుకు లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. వీఐపీలు వస్తారనే సాకుతో లిఫ్ట్‌ను నిలిపివేయడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లిఫ్ట్ వద్ద క్యూలైన్‌లో నిలబడలేక వృద్ధులు అక్కడ ఉన్న సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. లిఫ్ట్ వద్ద తోపులాటలో ఒక బాలిక చేతికి గాయం కాగా, మరో చిన్నారి స్పృహతప్పి పడిపోయింది. భక్తులను చేరవేసేందుకు రెండు లిఫ్ట్‌లు ఉన్నా కేవలం ఒకటి మాత్రమే వినియోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



లిఫ్ట్ వద్ద క్యూలైన్‌లో సొమ్మసిల్లిన చిన్నారి

అంతులేని గ్రావెల్ దోపిడీ



కొండవీడు కొండల సముదాయం సమీపంలో తవ్వి పడేసిన ప్రాంతం



గురుకుల పాఠశాల ముందు ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలు



గ్రావెల్ తరలించుకుపోతున్న టిప్పర్లు

- వందలాది ఎకరాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు విక్రయాలు
- భారీ గుంతలతో చెరువులుగా మారుతున్న వైనం
- పర్యావరణానికి తీరని ముప్పు
- పట్టించుకోని అధికారులు

చిలకలూరిపేట: గ్రావెల్ దోపిడీకి అంతులేకుండా పోతోంది. అది చారిత్రక ప్రాశస్త్యం ఉన్న ప్రాంతమైనా... సమీపంలో గురుకుల విద్యార్థులకు హాని కలిగించే ప్రమాదం ఉన్నా.. అవేమీ పట్టని అక్రమార్కులు గ్రావెల్ దోపిడీని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోని పెద్దన్న పాత్ర పోషిస్తున్న నాయకుల కనుసన్నల్లో కొనసాగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై కూటమిలోని మరో భాగస్వామియైన జనసేన పార్టీ నాయకులే వ్యతిరేకించేంత స్థాయిలో వ్యవహారం కొనసాగటం విశేషం.

వందలాది ఎకరాల్లో తవ్వకాలు

చిలకలూరిపేట నియోజకవర్గంలోని యడ్లపాడు మండలంలో విస్తృత స్థాయిలో అసైన్డ్, అటవీ భూములు విస్తరించి ఉంటాయి. ముఖ్యంగా చెంఘీజ్‌ఖాన్‌పేట పంచాయతీ పరిధి నుంచి కొంతమేర కొండవీడు వరకు ఎర్రమట్టి నేలలు విస్తారంగా ఉంటాయి. కొండవీడు కొండల మధ్య రెడ్డి రాజుల కాలంలో రక్షణగా ఎర్రమట్టితో వేసిన అడ్డుకట్టను సైతం 2014–19 నాటి టీడీపీ ప్రభుత్వ కాలంలో తవ్వి గ్రావెల్ విక్రయాలకు పాల్పడ్డారు. తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈ అక్రమ దందా విజృంభిస్తోంది. చెంఘీజ్‌ఖాన్‌పేట పంచాయతీ పరిధి నుంచి కొండవీడు కొండల సముదాయం పక్కన విస్తరించి ఉన్న వందలాది ఎకరాల భూముల్లో భారీగా గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జూన్ 28న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబంధిత స్థలానికి చేరుకొని గ్రావెల్ తరలించుకు పోతున్న లారీలను అడ్డుకున్నారు. మూడు టిప్పర్ లారీల డ్రైవర్ల నుంచి తాళాలు తీసుకొని యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి అప్పగించారు. ఆరు పొక్లెయిన్లతో రాత్రి పగలు తేడా లేకుండా తవ్వకాలు నిర్వహించి టిప్పర్ల ద్వారా గ్రావెల్ తరలించి అమ్ముకుంటున్నారని వారు ఫిర్యాదు చేయడం గమనార్హం.

అత్యంత ప్రమాదకరంగా గోతులు

ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్‌ను ఇష్టారాజ్యంగా తవ్వడంతో సంబంధిత ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. ఇదే ప్రాంతంలో ఉన్న గురుకుల పాఠశాల ముందు భాగంలో సైతం భారీగా తవ్వకాలు చేశారు. దీంతో ఆ ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారింది. వర్షాకాలం భారీ వర్షాలు కురిస్తే ఆ ప్రాంతంలో నీరు నిలవడం ఖాయం. విద్యార్థులు తెలిసో తెలియకో ఈతకు దిగడం వంటివి చేస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం లేకపోలేదు. ఇక్కడ ఒక టిప్పర్ లోడ్ చేసేందుకు రూ.6,500 వసూలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దూరాన్ని బట్టి రవాణా చార్జీలు అదనంగా ఉంటాయి. ఆరు పొక్లెయిన్లతో తవ్వకాలు నిర్వహిస్తూ రాత్రి పగలు తేడా లేకుండా రోజుకు 200 నుంచి 250 లోడ్ల వరకు గ్రావెల్ తరలిపోతుంటుంది. ఇవి ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న క్రమంలో ఆదాయం మొత్తం ఎవరి చేతుల్లోకి పోతుందనేది జగమెరిగిన సత్యం. రెవెన్యూ, మైనింగ్, అటవీశాఖ అధికారులు కళ్లు మూసుకొని నిద్ర నటిస్తుండటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని, అక్రమ గ్రావెల్ తరలింపును అడ్డుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

తవ్వకాలు చేస్తున్నది అసైన్డ్ భూములా, లేక అటవీ భూములా అనేది విచారిస్తున్నాం. రెవెన్యూ, మైనింగ్, అటవీ, పోలీసు అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అందిస్తాం.

– విజయశ్రీ, తహసీల్దార్, యడ్లపాడు

అనుమతులు లేవు

సంబంధిత ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలకు ఎవరికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. కొంతమంది దరఖాస్తు చేసుకొని ఉన్న మాట వాస్తవమే. అయితే ఎవరికి అనుమతులు మాత్రం ఇచ్చింది లేదు.

– నాగిని, అసిస్టెంట్ డైరెక్టర్, మైనింగ్, పల్నాడు జిల్లా

రైతుల నెత్తినే ప్రీమియం భారం

- ఉచిత పంటల బీమాకు కూటమి మంగళం
- ఐదేళ్లు రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

యడ్లపాడు: కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. గత రబీ సీజన్ నుంచే రైతులు నేరుగా బీమా ప్రీమియం చెల్లించుకోవాలని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో, ప్రీమియం భారం పూర్తిగా రైతులపై పడింది. అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు ముప్పేటా దాడి చేస్తున్న నేపథ్యంలో, ఈ ప్రీమియం భారం రైతులను మరింత కలవరపెడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందించే ఫసల్‌బీమా పథకం జిల్లాలో కేవలం మూడు పంటలకే మాత్రమే వర్తింపజేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

15లోగా ప్రీమియం చెల్లించాలి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి 38,599 హెక్టార్లు, కంది 21,054, మిరప 55,786, పత్తి 91,566 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేయనున్నట్లు అధికారులు అంచనాలు వేశారు. ఆయా పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే బీమా పరిధిలోకి వస్తాయి. పత్తి పంటకు ఈనెల 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలి. మిరప, కంది పంటలకు ఈనెల 31వరకు, వరి పంటకు ప్రీమియం చెల్లించే అవకాశం ఆగస్టు 15 వరకు అవకాశం ఉంది.



సాగుకు భూమి సిద్ధం చేస్తున్న రైతు

అన్నదాతలకు అండగా గత ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలిచారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి పలు వ్యవసాయ పథకాలు పారదర్శకంగా అమలు చేశారు. వాటిలో పంటబీమా గురించి ప్రధానంగా చెప్పుకోవాలి. ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతుల తరఫున ప్రభుత్వమే బీమా ప్రీమియం కట్టింది. మొదట కేవలం రైతు భాగస్వామ్యంగా ఒక్కరూపాయి చెల్లించాలని చెప్పినా, ఆ తర్వాత దానికి కూడా తీసేసి రైతులపై పైసాభారం పడకుండా చూసింది.

పంట	ప్రీమియం(ఎకరాకు)	బీమా మొత్తం (ఎకరాకు)
మిరప	రూ.360	రూ.90,000
కంది	రూ.40	రూ.20,000
వరి	రూ.80	రూ.40,000
ప్రత్తి	రూ.1900	రూ.38,000

దరఖాస్తు విధానం

రైతులు తమ పంటలను ఈ–పంటలో నమోదు చేసుకోవాలి. పంట రుణం తీసుకున్న రైతుల ప్రీమియంను బ్యాంకులు స్వయంగా మినహాయించుకుంటాయి. రుణం తీసుకోని అన్నదాతలు తమ సమీపంలోని మీ–సేవా, కామన్ సర్వీస్ సెంటర్లు, సచివాలయాలు, లేదా తమ ఖాతాలున్న బ్యాంకుల్లో నగదు చెల్లించవచ్చు. జాతీయ పంటల బీమా పోర్టల్‌లోనూ నేరుగా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోండి



జిల్లాలో వరి, కంది, మిరప పంటలు మాత్రమే ఫసల్ బీమా కిందకు, పత్తిపంట వాతావరణ బీమాకు వర్తిస్తాయి. వీటి గురించి క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్యం చేయాల్సిన బాధ్యత అధికారులు, గ్రామస్థాయి సిబ్బందిపై ఉంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఐ.మురళి, జిల్లా వ్యవసాయ అధికారి, పల్నాడు

క్లుప్తంగా

ఏపీ గ్రామీణ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా వాసుబాబు



సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ రాష్ట్ర ప్రెసిడెంట్‌గా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన శిరసాల వాసుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురంలో ఆదివారం నిర్వహించిన గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో గోల్డ్ అప్రైజర్ల సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో తనను రాష్ట్ర ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు యూనియన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వాసుబాబు నియామకంపై పలువురు హర్షం వెలిబుచ్చారు. ఆయనను సత్కరించారు.

అప్రైజర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఏపీ గ్రామీణ బ్యాంక్ తిరుపతి బ్రాంచిలో గోల్డ్ అప్రైజర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మస్తాన్ కిడ్నీ ఫెయిల్ అయి అనారోగ్యంతో చెన్నై వైద్యశాలలో చికిత్స పొందుతుండటంతో ఏపీ గ్రామీణ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ నుంచి రూ.1.05 లక్షలు ఆదివారం ఆర్థిక సాయంగా అందించారు. మస్తాన్ భార్య జాన్‌బీకి నగదును అందించినట్లు యూనియన్ రాష్ట్ర ప్రెసిడెంట్ శిరసాల వాసుబాబు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు, తదితరులు ఉన్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన టీడీపీ నాయకులు



నరసరావుపేట టౌన్: రొంపిచర్ల మండలం వీరవట్నం గ్రామంలో సాగు నీటి సంఘం కార్యాలయ శిలాఫలకాన్ని టీడీపీ గ్రామ నాయకులు శనివారం ధ్వంసం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు భవన నిర్మాణానికి సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీన్ని గ్రామంలోని వ్యతిరేక వర్గం ధ్వంసం చేసింది. దీంతో టీడీపీలో ఉన్న అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ధ్వంసం చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని వీరవట్నం గ్రామ నీటి సంఘం మాజీ అధ్యక్షుడు వెలగమూరి వెంకటనారాయణ రొంపిచర్ల పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు వేళాయె..

- నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్–2025 కౌన్సెలింగ్
- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్
- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర సాంకేతిక విద్య, ఉన్నత విద్యా మండలి
- ఈ నెల 17 వరకు హెల్ప్‌లైన్ కేంద్రాల వారీగా ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన
- ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్లు



ఏపీ ఈఏపీసెట్‌కు హాజరైన విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్–2025) కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్య, ఉన్నత విద్యామండలి షెడ్యూల్ విడుదల చేశాయి. మే నెలలో జరిగిన ఏపీ ఈఏపీసెట్–2025 (ఎంపీసీ స్ట్రీమ్)లో అర్హత సాధించి, ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఎదురు చూస్తున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఏ ధ్రువపత్రాలు అవసరమంటే..

ఏపీ ఈఏపీసెట్–2025 వెబ్ బేస్డ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సిన ధ్రువపత్రాల జాబితాను నోటిఫికేషన్‌లో పొందుపర్చారు. ఏపీ ఈఏపీసెట్–2025 ర్యాంక్ కార్డ్, హాల్ టిక్కెట్, ఇంటర్ మార్కుల జాబితా, జనన ధ్రువీకరణ పత్రం /టెన్త్ సర్టిఫికెట్, టీసీ, 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్, 2025–26 సంవత్సరపు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ప్రైవేటు విద్యార్థులకు రెసిడెన్స్ సర్టిఫికెట్, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సామాజిక వర్గ ధ్రువీకరణ పత్రాలు, శారీరక వైకల్యం గల విద్యార్థులకు సంబంధిత ధ్రువీకరణ పత్రం అవసరం అని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపుతో మొదలు

ఏపీ ఈఏపీసెట్–2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు సోమవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు సెట్స్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. ఇందు కోసం ఏపీఈఏపీ సెట్ హాల్ టిక్కెట్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి లాగిన్ కావాలి.



వెబ్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు (ఫైల్)

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు: **02**, సీట్లు: **780**

ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు: **34**, సీట్లు: **29,460**

ఏపీఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల సంఖ్య: **23,536**

- రిజిస్ట్రేషన్ సమయంలో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600 చొప్పున ప్రాసెసింగ్ ఫీజును ఇదే వెబ్‌సైట్‌లో క్రెడిట్ కార్డు, డెబిట్‌కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలి. ఏపీఈఏపీ సెట్ డీటైల్డ్ నోటిఫికేషన్, యూజర్ మాన్యువల్, కళాశాలల జాబితా, విద్యార్థులకు మార్గదర్శకాలను ఇదే సైట్‌లో పొందుపర్చారు.

దరఖాస్తు సమయంలోనే సర్టిఫికెట్ల పరిశీలన

ఏపీఈఏపీసెట్–2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలన కోసం హెల్ప్‌లైన్ కేంద్రాలకు విధిగా వెళ్లాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసే సమయంలోనే విద్యార్థులు సమర్పించిన టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, సామాజికవర్గ, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను వెబ్ బేస్డ్ విధానంలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పూర్తి చేసింది. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యే 'రిజిస్ట్రేషన్ వివరాలు తెలుసుకోండి' అనే చోట క్లిక్ చేయాలి. తద్వారా విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఏస్థాయిలో ఉన్నదీ తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తయిన విద్యార్థులకు కంప్యూటర్ స్క్రీన్‌పై కేండెట్ ఈజ్ ఎలిజిబుల్ ఫర్ ఎక్సర్‌సైజింగ్ ఆప్షన్స్ అని కనిపిస్తే, విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధం కావచ్చు. ఈ విధంగా కాకుండా ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ హెల్ప్‌లైన్ కేంద్రంలో పురోగతిలో ఉన్న పక్షంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈజ్ అండర్ ప్రోగ్రెస్ అని కనిపిస్తుంది.

సమీప కేంద్రం ఎంపిక ఇలా..

ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలు అసంపూర్తిగా ఉండటం, వివరాలు అసమగ్రంగా ఉన్న పరిస్థితుల్లో కాంటాక్ట్ హెల్ప్‌లైన్ సెంటర్ (హెచ్‌ఎల్‌సీ) అని డిస్‌ప్లే అవుతుంది. ఈ విధంగా డిస్‌ప్లే అయితే ఆన్‌లైన్‌లో పొందుపర్చిన హెల్ప్‌లైన్ కేంద్రాల జాబితా నుంచి తమకు సమీపంలోని కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలి. అనంతరం విద్యార్థులకు సంబంధించి అసమగ్రంగా ఉన్న సర్టిఫికెట్ల వివరాలు డిస్‌ప్లేలో ప్రత్యక్షమవుతాయి. సంబంధిత సర్టిఫికెట్లను విద్యార్థులు తిరిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత సంబంధిత హెచ్‌సీఎల్‌లో అధికారులు వాటిని పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటే ఆమోదిస్తారు. దీంతో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తవుతుంది. అనంతరం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు.

హెల్ప్‌లైన్ కేంద్రాలు ఇక్కడున్నాయి..

గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో పాటు నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు సమయంలో విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను ఆయా హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఈ నెల 7వ తేదీ నుంచి 17వ వరకు పరిశీలిస్తారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు ఈ నెల 19న తుది అవకాశం ఉండగా, ఈ నెల 22న సీట్ల కేటాయింపు జరుపుతారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు కళాశాలల్లో చేరికలు, ఆగస్టు 4వ తేదీ నుంచి బీటెక్ ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 36 ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో 30,240 సీట్లు ఉన్నాయి. వీటిలో రెండు ప్రభుత్వ కళాశాలల్లో 780 సీట్లు ఉండగా, 34 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో 29,460 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కాగా ఈఏపీ సెట్ ఇంజినీరింగ్ పరీక్షలో 23,536 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వీరిలో జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్ వంటి పరీక్షల ద్వారా జాతీయస్థాయి విద్యాసంస్థల్లో చేరిన వారు ఉన్నారు.

తెల్లపేపర్‌పై జీఎస్టీ వసూలు

- నరసరావుపేటలోని ఓ బ్యూటీ పార్లర్ నిర్వాకం
- ఇదేమని ప్రశ్నించిన ఓ అధికారిణికి నిర్లక్ష్యపు సమాధానం
- తమ వద్ద ఇలానే ఉంటుందంటూ రుబాబు



నరసరావుపేట టౌన్: నరసరావుపేటలోని కొన్ని బ్యూటీపార్లర్లలో అనధికార జీఎస్టీ వసూలు చేస్తూ కస్టమర్ల జేబులు గుల్ల చేస్తున్నారు. తాజాగా ఆదివారం పట్టణంలోని అరండల్‌పేటకు చెందిన నేచురల్స్ బ్యూటీపార్లర్‌కు ఓ ఉన్నత స్థాయి అధికారిణి వెళ్లారు. అక్కడ సర్వీసు అనంతరం వారు ఇచ్చిన బిల్లు చూసి సదరు అధికారి అవాక్కయ్యారు. ఆ బిల్లులో సర్వీస్ ఛార్జీలతోపాటు జీఎస్టీ కూడా కలిపి అధిక మొత్తంలో చేతితో రాసి ఇవ్వడంతో విస్మయం చెందారు. సర్వీస్ ఛార్జీలతోపాటు సెంట్రల్ జీఎస్టీ 18 శాతం చెల్లించాలంటూ రాశారు. నిబంధనలకు విరుద్ధంగా జీఎస్టీ ఎలా వసూలు చేస్తారంటూ ఆ అధికారిణి నిర్వాహకులను ప్రశ్నించారు. దీంతో బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు తమ వద్ద ఇలానే ఉంటుందని దురుసుగా జవాబిచ్చారు. తాము ఇచ్చినంత బిల్లు చెల్లించాల్సిందే అంటూ దౌర్జన్యానికి దిగారు. అప్పటికే సదరు అధికారిణి బిల్లు చెల్లించారు. ఇదేవిధంగా వినియోగదారుల వద్ద అనధికారికంగా జీఎస్టీ వసూలు చేయడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సదరు అధికారిణి సిద్ధమయ్యారు. అయితే ఆ బ్యూటీ పార్లర్ ఓ సీఐకి చెందినదని తెలియ వచ్చింది. నరసరావుపేటలో నిర్వహిస్తున్న కొన్ని బ్యూటీ పార్లర్లలో ప్రతి నిత్యం ఇలానే అనధికార బిల్లులతో కస్టమర్ల జేబులు గుల్లచేస్తున్నట్లు సమాచారం.

రేపటి లోగా ఎస్సీ విద్యార్థులతో పోస్టల్ అకౌంట్‌లు తెరిపించండి

నరసరావుపేట: ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది చదువుతున్న ఎస్సీ విద్యార్థులతో పోస్టల్ అకౌంట్లు మంగళవారంలోపు తెరిపించాలని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఈ.ఈశ్వరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లికి వందనం రెండో విడత నిధులు విడుదలవుతున్న నేపథ్యంలో సహాయ సంక్షేమాధికారులు, కళాశాల కో ఆర్డినేటర్లు, వసతి గృహ సంక్షేమాధికారులు, సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు తమ పరిధిలో అర్హత కలిగిన ఎస్సీ విద్యార్థులను గుర్తించి వారి పోస్టల్ అకౌంట్లు ఆధార్ నంబర్లకు ఎన్‌పీసీఐ లింకు చేయించాలని సూచించారు. ఇప్పటికే అకౌంట్లు తెరిచిన వారు ఎన్‌పీసీఐతో లింకు పరిశీలించుకోవాలని అన్నారు. తొమ్మిది, పది తరగతులకు చెందిన 70 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు అకౌంట్లకు ఎన్‌పీసీఐ లింకు పెండింగ్‌లో ఉందని చెప్పారు. 133 మంది ఇంటర్ విద్యార్థుల మ్యాపింగ్ కూడా పెండింగ్‌లో ఉందని వివరించారు.

మహిళ పొట్ట నుంచి నాలుగు పెన్నులు వెలికితీత

మాతాశ్రీ హాస్పిటల్‌లో లాప్రోస్కోపి ద్వారా అరుదైన శస్త్ర చికిత్స

నరసరావుపేట: ఓ మహిళ పొట్ట నుంచి నాలుగు బాల్‌పెన్నులు డాక్టర్లు బయటకు తీసిన ఘటన పట్టణంలోని మాతాశ్రీ హాస్పిటల్‌లో శనివారం చోటుచేసుకుంది. వినుకొండ రోడ్డులోని మాతాశ్రీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.రామచంద్రారెడ్డి ఆదివారం తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన ఓ మహిళ వాంతులతో బాధపడుతుండగా ఆమె కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. ఎండోస్కోపీ ద్వారా పరీక్షలు నిర్వహించగా పేగులో పెన్నులు ఉన్నట్లు గుర్తించినట్లు వివరించారు. అనుమానంతో సిటీస్కాన్ చేయించడంతో నాలుగు పెన్నులు ఉన్నట్లు బయటపడిందన్నారు. వెంటనే తమ హాస్పిటల్‌లోని అధునాతనమైన లాప్రోస్కోపిక్ పద్ధతిలో పొట్టలో నుంచి నాలుగు పెన్నులు చాకచక్యంగా బయటకు తీశామన్నారు. ఆమెను ఆరోగ్యవంతంగా ఇంటికి పంపించామని చెప్పారు. లాపరోస్కోపి ద్వారా ఇలాంటి అరుదైన శస్త్రచికిత్స చేయటం పల్నాడులో ఇదే మొదటి సారని డాక్టర్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కాగా, ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసిన డాక్టర్‌ను పలువురు సహచర డాక్టర్లు, పట్టణ ప్రముఖులు అభినందించారు.



మహిళ పొట్ట నుంచి తొలగించిన పెన్నులు

ఆరుగురిపై పిచ్చి కుక్క దాడి

పెదకూరపాడు: పెదకూరపాడులోని ముస్లిం కాలనీలోని పిచ్చి కుక్క ఆరుగురుపై ఆదివారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. నాలుగేళ్ల పఠాన్ మహ్మద్ అమన్, వృద్ధుడు షేక్ ఖాసిం, సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న షేక్ హుస్సేన్, నిమ్మకాయల వ్యాపారి షేక్ ఖాసింలతో పాటు మరో ఇద్దరిపై విచక్షణ రహితంగా కరిచింది. నాలుగేళ్ల అమన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జూన్ 18వ తేదిన మండలంలోని పాటిబండ్ల గ్రామానికి చెందిన చిన్నారులు, వృద్ధులు 16 మందిపై పిచ్చి కుక్క దాడి చేసింది. రోడ్డు పక్కనే మాసం విక్రయాలు జరుపుతుండంతో గుంపులు కుక్కలు అమరావతి, సత్తెనపల్లి కాలచక్ర రోడ్డుపై తిరుగుతూ వాహనదారులను కరుస్తున్నాయి.



పిచ్చికుక్క దాడిలో తీవ్ర గాయాలైన అమన్



చికిత్స పొందుతున్న గాయాలుపాలైన హుస్సేన్

వీధి కుక్కలు .. భౌబోయ్..!

- జిల్లాలో హడలెత్తిస్తున్న వీధికుక్కలు
- రోడ్లపై గుంపులుగా తిరుగుతూ జనంపై దాడులు
- ద్విచక్ర వాహనాల వెంట పరుగులు
- యువకుడికి త్రుటిలో తప్పిన ప్రమాదం
- రోడ్ల పైకి రావాలంటేనే భయపడుతున్న ప్రజలు



సత్తెనపల్లి పాతబస్టాండ్ సెంటర్‌లో వీధికుక్కలు

సత్తెనపల్లి: వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడ చూసినా రోడ్లపై గుంపులుగా కనిపిస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వాహనాలను వెంబడించి మరీ దాడి చేస్తున్నాయి. చిన్నారులు కనిపిస్తే కొరికేస్తున్నాయి. జిల్లాలో ఏడాది కాలంగా యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం పూర్తిగా నిలిచిపోయింది. వీధి కుక్కల సంతతి విపరీతంగా పెరిగిపోయింది. జన సంచారం లేని రోడ్డు ఉందేమో గానీ.. వీధి కుక్కల సంచారం లేని రోడ్డు లేదంటే అతిశయోక్తి కాదు.

తల్లిదండ్రుల్లో ఆందోళన....

పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. చిన్నారుల ను పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తు న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలను పాఠశాలల్లో వదిలి తల్లిదండ్రులు పొలాలకు వెళ్తుంటారు. దీంతో చిన్నారుల భద్రత మీద ఆందోళన చెందుతున్నా రు. పల్లెల్లో వీధి కుక్కలు బెడద ఎక్కువగా ఉండ డంతో పిల్లలు స్కూల్ నుంచి ఒంటరిగా వచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోన ని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

అటకెక్కిన బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం...

వీధి కుక్కలు పెరగకుండా నియంత్రణకు యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం నిర్వ హించాల్సి ఉంది. మగ కుక్కలకు క్యాస్ట్రేషన్ చేస్తారు. ఆడ కుక్కలకు గర్భసంచి తీసేస్తారు. దీంతో పునరుత్పత్తి జరగదు. క్రమంగా వీధి కుక్కల సంఖ్య తగ్గిపోతుంది. కానీ జిల్లాలో ఎక్కడా ఏబీసీ ప్రోగ్రాం జరిగిన దాఖలాలు కనిపించడం లేదు. అధికారులు మాత్రం వీధి కుక్కలకు త్వరలో ఆపరేషన్లు చేయిస్తామంటూ చెప్పి తప్పించుకుంటున్నారు. పదే పదే మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు ప్రస్తావించినా కనీసం నామ మాత్రంగా కూడా చర్యలు తీసుకోవడం లేదని ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు.

ప్రాణాంతకంగా మారిన రేబిస్...

కుక్కలు కరిస్తే రేబిస్ సోకే ప్రమాదం ఉంది. కుక్క కాటు వేసిన వెంటనే వ్యాక్సిన్ వేయించుకోవాలి. లేకపోతే రేబిస్ బారిన పడితే చాలా ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రాణాలకు గ్యారెంటీ చెప్పలేని దుస్థితి. నరాల వ్యవస్థ మొత్తం దెబ్బతిని చివరికి ప్రాణాలు పోతాయి. రేబిస్ సోకిన వారిలో కొందరు మంచినీళ్లు తాగడానికి కూడా భయపడి పోతారు. ఈ లక్షణాన్ని వైద్య పరిభాషలో హైడ్రోఫోబియా అంటారు. నీళ్లు తాగకపోవడంతో డీహైడ్రేషన్ ఏర్పడి మరణానికి గురవుతారు. అందుకే కుక్క కరిచిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) చేయించుకోవాలి. తీవ్రమైన గాయాలైనప్పుడు, పిచ్చి కుక్క కాటు వేసినప్పుడు, కాటు తీవ్రతను బట్టి హిమునోగ్లోబిన్ ఇంజక్షన్ చేస్తారు. దీని వలన తక్షణమే వ్యాధి నిరోధక శక్తి చేకూరుతుంది. అదే ఏఆర్‌వీ వలన వ్యాధి నిరోధక శక్తి సమకూరడానికి మూడు నెలల వరకు పట్టవచ్చు.

పెరిగిన వీధికుక్కల బెడద...

జిల్లాలోని పురపాలక సంఘాలు, నగర పంచాయతీలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కల బెడద ఎక్కువైంది. గ్రామీణ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లి వచ్చే రైతులు, పట్టణ శివారు ప్రాంతాల్లో రాకపోకలు సాగించేవారు, ఇంటిముందు ఒంటరిగా ఆడుకునే చిన్నారులు, వాహనాలపై వెళ్లేవారు ఎవరు కనిపిస్తే వారిపై ఎగబడి రెక్కేస్తున్నాయి. ఈ నెల 4న సత్తెనపల్లి వీరాంజనేయ నగర్‌లో దేశినేని అశోక్ అనే నాలుగేళ్ల చిన్నారిపై వీధి కుక్కలు విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచాయి. ఈ ఘటన మరవక ముందే ఆదివారం ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్తెనపల్లి నుంచి గుంటూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడిని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట వీధి కుక్కలు వెంబడించడంతో యువకుడు ప్రధాన రహదారిపై పడిపోయాడు. ఆ సమయంలో వాహనాల రద్దీ లేకపోవడంతో స్వల్ప గాయాలతో పెను ప్రమాదం నుంచి యువకుడు బయటపడ్డాడు. దీంతో వీధి కుక్కలు అంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. పిల్లలను ఒంటరిగా స్కూలుకు పంపించాలంటేనే వణికిపోతున్నారు.



ఈ నెల 4న సత్తెనపల్లిలో వీధికుక్కల దాడిలో వీపుకు గాయాలైన చిన్నారి అశోక్